అందని నీరు.. ఆందోళనలో రైతులు


మారేపల్లిలో పొట్ట దశలో ఎండిపోతున్న వరి పంట

- ఏఎమ్మార్పీ 25 డిస్ట్రిబ్యూటరీ కింద చివరి భూములకు అందని సాగునీరు
- ఎండిపోతున్న వరి పొలాలు
- పశువులకు మేతగా మారుతున్న చేలు

హాలియా : అప్పులు తెచ్చి పెడుబడులు పెట్టి..ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయి. డీ 25 కాల్వ చివరి భూములకు సాగునీరందక మండలంలోని మారేపల్లి గ్రామంలో వరి పంటలు ఎండి పోతున్నాయి. ఏఎమ్మార్పీ పరిధిలోని డీ 25 కాల్వ ద్వారా మారేపల్లి గ్రామంలో రైతుల పంట పొలాలకు సాగు నీరందుతుంది. అయితే డీ 25 కాల్వ పరిధిలోని కొందరు రైతులు కాల్వ తూములకు అడ్డుకట్టలు వేసి నీటిని మళ్లించుకుపోవడం వల్ల చివరి భూములకు నీరందక పొట్ట దశకు వచ్చిన సుమారు 100 ఎకరాల్లో వరి పొలాలు బీటలువారుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట తమ కళ్ల ముందే ఎండిపోతుండడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

ఆశల సాగు ఆవిరయ్యే..

డీ 25 కాల్వ ద్వారా మారేపల్లి గ్రామానికి సాగు నీరందుతుంది. డీ 25 కాల్వను నమ్ముకొని అనేక మంది రైతులు ఎన్నో ఆశలతో యాసంగి సీజన్‌లో వరి సాగు చేశారు. అయితే చివరి భూముల వరకు సాగునీరు అందకపోవడంతో యాసంగిలో సాగు చేసిన పంట పొలాలు నిట్టనిలువునా ఎండిపోతున్నాయి. డీ 25 కాల్వ మొదటగా ఉన్న కొందరు రైతులు తూములకు అడ్డుకట్టలు వేయడం వల్ల చివరి భూములకు నీరందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికందే దశలో పంటపొలాలకు నీరందక ఎండిపోతున్నాయని, ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటపొలాలు పశువులకు మేతగా మారుతున్నాయని రైతులు వాపోతున్నారు.

అప్పులే మిగిలాయి..



రెండు ఎరాల పొలాన్ని ఎకరాకు 8 బస్తాల చొప్పున కౌలు తీసుకొని వరి సాగు చేశా. రూ. 80వేలు అప్పు చేసి రెండు ఎకరాలకుగాను పెట్టుబడి పెట్టాను. ఎస్‌ఎల్‌బీసీ కెనాల్ పరిధిలోని డీ –25 కాల్వ యాసంగిలో రెండు ఎకరాల్లో వరి సాగు చేశాడు. పొట్ట దశకు వచ్చాక పైరుకు నీరందక పైరు నిలువునా ఎండిపోయింది. దీంతో చేసేదేమీ లేక ఎండిన పంటను పశువులు మేపాలనుకుంటున్నా. పంట పెట్టుబడికి తెచ్చిన అప్పు ఎలా తీర్చాలో అర్థమవుతలేదు.

– అనుముల చిన్న విజయ్, రైతు మారేపల్లి

దరఖాస్తుల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి


తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ కార్డుల దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

త్రిపురారం : ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. బుధవారం కలెక్టర్ మండల కేంద్రంలో పర్యటించి పలు ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేశారు. కంపాసాగర్ గ్రామ పరిధిలోని కస్తూరిబా గాంధీ పాఠశాలకు వెళ్లి వంట సరుకులు, పాఠశాల పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు సైన్స్‌లో పాఠాలు బోధించి ప్రశ్నలు అడిగి జవాబు రాబట్టారు. బట్టి చదువులు కాకుండా సబ్జెక్ట్‌ను అర్థం చేసుకోవాలన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ ఎలా జరుగుతుందని త హసీల్దార్‌ను అడిగి తెలుసుకొని రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. మందులు ఏమైనా కొరత ఉన్నాయా.. సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా అని ఆరా తీశారు. ఆస్పత్రి భవనం అక్కడ అక్కడ పెచ్చులు ఊడుతున్నాయని డాక్టర్ శంకర్ నాయక్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీఓ విజయకుమారి, డాక్టర్ శంకర్‌నాయక్, విజయలక్ష్మీ, సైదులు, కార్యదర్శి రాజేంద్రకుమార్ ఉన్నారు.

సదస్సుకు ఏర్పాట్లు చేయాలి

నల్లగొండ : గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, వైద్య పరీక్షలు, తదితర జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకుగాను ఈ నెల 28న దేవరకొండలో నిర్వహించనున్న అవగాహన సదస్సుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం ఆమె తన క్యాంపు కార్యాలయంలో మహిళా, శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. స్త్రీలు గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం అయ్యే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రసవానంతరం పాలు పట్టడం, తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకే సదుస్సు నిర్వహిస్తున్నట్లు తెలి పారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీ నివాస్, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, శారద పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేగం కన్నా ప్రాణం మిన్న


మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్రపవార్

వేములపల్లి : వేగం కన్నా ప్రాణం మిన్న అని అతివేగం ప్రమాదకరమని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మిషన్ రోడ్ సెఫ్టీ, రూల్స్, రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గమ్యాన్ని చేరాలన్న ఆత్రుతలో వాహనదారులు తమ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారన్నారు. ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, సీట్ బెల్ట్ ధరించి వాహనాలను నడపాలని సూచించారు. మాదాలపై స్థానికంగా ఉన్న ప్రజల అభిప్రాయం తీసుకున్నారు. అనంతరం రోడ్డు సేఫ్టీ కమిటీని నియమించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐలు ప్రసాద్, ఎస్‌ఐలు, ప్రజలు పాల్గొన్నారు.

వరిపొలాల పరిశీలన

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని కొండ్రపోల్‌లో రైతులు సాగు చేసిన వరి పొలాలను మండల వ్యవసాయాధికారి రుషేంద్రమణి బుధవారం సందర్శించి పరిశీలించి మాట్లాడారు. వరిలో మెడ విరిపు తెగులు ఉన్నట్లు గమనించామని, దీని నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6గ్రాముల చొప్పున పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అజ్మీరా సైదులు, రైతులు చిన్నసైదులు, గంగరాజు, శ్రీకాంత్, రమేష్, కోటయ్య పాల్గొన్నారు.

మూల్యాంకన రెమ్యునరేషన్ ఇవ్వాలి

పెద్దవూర : గతేడాది 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల ప్రశ్నపత్రాలను మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ ఇప్పటికైనా ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రమావత్ కృష్ణ, గోలి కృష్ణలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఈ నెల 20న నల్లగొండ జిల్లా విద్యాధికారి కార్యాలయం ముందు టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన ప్రదర్శన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఒక విద్యా సంవత్సరం గడిచిపోయి మరలా పదవ తరగతి పేపర్లను మూల్యాంకనం చేసే ప్రక్రియ మొదలవుతున్నా ఇప్పటికి రెమ్యూనరేషన్ ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. నిరసనకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి రూ.2లక్షల విరాళం

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని కొర్రోనితండాలో నిర్మించనున్న హింగ్లామాత ఆలయ నిర్మాణానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు వడ్త్య రమేష్‌నాయక్ బుధవారం రూ.2లక్షలను విరాళంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హింగ్లా మాత ఆలయ నిర్మాణంలో పాలుపంచుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులను ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బావోజీ ఖండ్యనాయక్, గోపాల్‌నాయక్, పూజారులు లచ్చిరాం, తుల్సిరాం, తండావాసులు బగుడు, కొమ్యు, ఛత్రియ, నామ, మోత్య, నాను, శంకర్, హతిరాం, లచ్చిరాం, కొర్ర నాగరాజు, చైతన్య, కోటేష్, నగేష్, నీలాదర్ పాల్గొన్నారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఎంపిక


గోర్ల కోటేష్

పెద్దఅడిశర్లపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్ష ఫలితాల్లో పెద్దఅడిశర్లపల్లి మండల కేంద్రానికి చెందిన గోర్ల కోటేష్ రాష్ట్ర స్థాయిలో 107వ ర్యాంకు సాధించి ఉద్యోగం పొందాడు. నిరుపేద కుటుంబంలో జన్మించిన కోటేష్ ప్రభుత్వ ఉద్యోగం సాధించడంపై స్నేహితులు, బంధువులు, గ్రామస్తులు అభినందించారు.

బినామి పేర్లతో రుణాలు తీసుకుంటే కేసు


సమావేశంలో పాల్గొన్న స్త్రీ నిధి అధికారులు

మిర్యాలగూడ టౌన్ : స్త్రీ నిధి కింద తీసుకున్న రుణాలను ఈనెల 31వ తేదీలోగా చెల్లించాలని, నిధి రుణాలు ఎవరైన బినామి పేర్లతో తీసుకుంటే వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, శ్రీనిధి జోనల్ మేనేజర్ అనంత కిశోర్, స్త్రీ నిధి రీజినల్ మేనేజర్ బి.శ్రీలేఖ అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అడిషినల్ కలెక్టర్(లోకల్ బాడీ) జె.శ్రీనివాస్ ఆదేశాల మేరకు మెప్మా రిసోర్స్ పర్సన్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. శ్రీనిధి కింద చాల వరకు పెండింగ్ బకాయిలు ఉన్నాయని, వాటిని త్వరతిగతిన చెల్లించి తిరిగి రుణాలను తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీలో ఆస్తి పన్నుల బకాయిలు కూడా భారీగా పెరుకుపోయాయని, ఈనెల 31వ తేదీ వరకు వంద శాతం పూర్తయ్యే విధంగా మున్సిపాలిటీలో కొత్త సంఘాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు. శ్రీనిధి కింద ఇప్పటి వరకు రూ.16 కోట్ల 84లక్షల వరకు రుణాలు ఇవ్వగా 2.72 కోట్ల రూపాయల వరకు పెండింగ్ బకాయిలు ఉన్నాయని, వాటిని తక్షణమే చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో మెప్మా టీఎంసీ పాతేపాక బక్కయ్య, సీఓ వెంకటేశ్వర్లు, సతీష్, రిసోర్స్ పర్సన్లు ఉన్నారు.

పల్లా మోహన్‌రెడ్డి మృతి బాధాకరం : జగదీష్‌రెడ్డి


మోహన్‌రెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జగదీశ్‌రెడ్డి

పెద్దవూర: తెలంగాణ మలిదశ ఉద్యమ కారుడు మోహన్‌రెడ్డిని కోల్పోవడం బాధగా ఉందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మండలంలోని పర్వేదుల గ్రామానికి చెందిన బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా మోహన్‌రెడ్డి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన బుధవారం పర్వేదులకు వచ్చి మోహన్‌రెడ్డి పార్థీవదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పరామర్శించిన వారిలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు భగత్, ఎన్. భాస్కర్‌రావు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, హాలియా ఏఎంసీ చైర్మన్ టి.చంద్రశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, నాయకులు ఉన్నారు. అలాగే బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పల్లా మోహన్‌రెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు ఆ సంఘం వైస్ ప్రెసిడెంట్ డీవీఎస్ రెడ్డి తెలిపారు. మండలంలోని పర్వేదుల గ్రామానికి వెళ్లి మోహన్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, రామేశ్వర్‌రావు, సత్యం, ఎస్.సత్యనారాయణ, వి.శ్రీనివాస్‌రెడ్డి, ఉన్నారు

కాంగ్రెస్ హయాంలోనే బీసీలకు న్యాయం


దేవరకొండ : ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు


మిర్యాలగూడ : దామరచర్లలో..


హాలియా : సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హాలియా : ప్రభుత్వం బీసీలకు 42శాతంబిల్లు, ఎస్సీ వర్గీకరణకు చట్టం అసెంబ్లీలో ఆమోదంపై మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో అనుముల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, నాయకులు చంద్రారెడ్డి, గౌనీరాజా రమేష్ యాదవ్, వెంకట్ రెడ్డి, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ : బీసీల రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులకు అసెంబ్లీలో ప్రభుత్వం ఆమోదం తెలపడంపై మండలంలోని గూడూరు గ్రామంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు కట్టెబోయిన రామలింగయ్య యాదవ్, వెంకయ్య, నూకపొంగ సాగర్, వెంకటరమణ, వెంకన్న, ముసలయ్య, మధు, సైదులు, బ్రహ్మం, రాంబాబు, శ్రీధర్, గజ్జి, గోపి, వెంకటయ్య, రాంబాబు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

దామరచర్లలో..

బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులను అసెంబ్లీలో ఆమోదించడంపై బుధవారం దామరచర్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దేవరకొండ : బీసీలకు 42శాతం రిజర్వేషన్, ఎస్సీ ఉపకులాల వర్గీకరణ బిల్లులు అసెంబ్లీలో పాస్ అయినందుకు గాను బుధవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దేవరకొండ పట్టణ కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అంతకు ముందు పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లోకసాని శ్రీధర్‌రెడ్డి, జూలూరి ధనలక్ష్మీబాలనారాయణ, ఆలంపల్లి నర్సింహ్మా, నల్లగాసు జాన్ యాదవ్, మారుపాకుల సురేష్‌గౌడ్, పున్న వెంకటేశ్వర్లు, ఎండీ.యూనూస్, రాంసింగ్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : ఎస్సీ ఉప కులాల రిజర్వేషన్లు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులు శాసన సభ, మండలిలో ఆమోదం తెలపడంతో బుధవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌కమిటి చైర్మన్‌నాయిని జమున మాధవరెడ్డి, సిరాజ్‌ఖాన్, కైసర్‌ఖాన్, బొడ్డుపల్లి సైదులు, వస్కుల బక్కలయ్య, కొడిదాల వెంకటయ్య, బూడిద మల్లేష్, పాండునాయక్, బుడిగె శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లు 42శాతం, ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించడంపై బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్లెక్సికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్, అధ్యక్షులు బాలునాయక్, అశోక్ నాయక్, మోతీలాల్, వెంకటేశ్వర్లు, బిక్షం, పాండు, సైదయ్య, అజయ్, వెంకయ్య పాల్గొన్నారు.

చింతపల్లి : బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రాజకీయ రిజర్వేషన్లను 42శాతం పెంచుతూ అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందడం హర్షనీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బాలునాయక్ ఫ్లెక్సీ లకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ జడ్పీటీసీ హరినాయక్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ యాదవ్, నాయకులు కొండల్ యాదవ్, జాంగిర్, రీయాజ్, వెంకటనర్సింహారెడ్డి, పూరషోత్తంరెడ్డి ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం


మిర్యాలగూడ టౌన్ : మంద కృష్ణమాదిగ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

హాలియా : రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలపడంపై ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో బుధవారం హాలియా పట్టణంలో స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గడుసు సైదీష్ మాదిగ, మండల అధ్యక్షుడు ప్రసాద్, పెద్ద సైదులు, విజయ్ తదితరులు ఉన్నారు.

మాదిగ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

రాష్ట్ర అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై మాదిగ ఉద్యోగుల సంఘం, వివిధ సంఘాల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు మందా సైదులరావు గౌతమ్, సోమశేఖర్, దేవేందర్, విజయ్, సైదులు, చిన్న శేఖర్, వెంకన్న, యడవెల్లి రాంబాబు, న్యాయవాది చంద్రశేఖర్, పీఆర్‌టీయూ నాయకులు తదితరులు ఉన్నారు.

మిర్యాలగూడ టౌన్ : ఎస్సీ వర్గీకరణ కోసం రాజీలేని ఉద్యమాలను చేపట్టినందుకు అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించినందుకు గాను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఫ్లెక్సీకి స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ వద్ద ఎమ్మార్పీఎస్ జాతీయ నేత దైద సత్యం, మచ్చ ఏడుకొండలు ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యకమంలో నాయకులు రాజు, మధు, రాజశేఖర్, సాల్మన్, సాగరయ్య, రవి, అనసూర్య, శ్రీనివాస్, సైదులు, రమేష్, శ్రీనివాస్, సురేందర్ ఉన్నారు.

నాగార్జునసాగర్ : మందకృష్ణ మాదిగ చిత్రపటానికి నందికొండలోని ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం పాలాభిషేకం చేసి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. స్వీట్లు పిణీ చేయడంతో పాటు ర్యాలీ నిర్వహించారు. 30ఏళ్ల పోరాట ఫలితంగా తెలంగాణ అసెంబ్లీల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేవారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాజీవ్, రాహుల్, లక్ష్మయ్య, ప్రవీన్, అజయ్, భాస్కర్, రమణ, పెంచలయ్య, వీరబాబు, బద్రి, నకులరావు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

చిన్న పిల్లలకు బాలామృతం తప్పనిసరి

త్రిపురారం : చిన్నపిల్లలకు ఆరు నెలల నుంచి మూడేళ్ల వయస్సు వరకు అంగన్‌వాడీ కేంద్రంలో అందించే బాలామృతాన్ని తప్పని సరిగా తినిపించాలని దామరచర్ల ప్రాజెక్ట్ ఐసీడీఎస్ సీపీడీఓ చంద్రకళ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సీపీడీఓ తనిఖీ చేసి రికార్డులు, కేంద్రంలో అందించే ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ టీచర నాతి శైలజ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ విద్య, ఉపాధికి నిరంతర పోరాటం

మిర్యాలగూడ అర్బన్ : భగత్ సింగ్ స్ఫూర్తితో అందరికీ విద్య, ఉపాధి కోసం పోరాటం చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ముడావత్ రవినాయక్ అన్నారు. బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో 'అందరికీ సమాన విద్యా.. ఉపాధికై' అనే అంశంపై పట్టణంలో నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి కుర్ర సైదానాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సెమినార్‌లో నాయకులు పతాని శ్రీను, జగన్‌నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి డేగాట


డేగాట సందర్భంగా రంగులు చల్లుకుంటున్న భక్తులు

వేములపల్లి : మండలంలోని సల్కునూరు గ్రామ బుధవారం గ్రామంలోని స్వయంభూ లక్ష్మీనర్సింహస్వామి డేగాట సందర్భంగా వసంతోత్సవం(హోలీ)ని ఘనంగా జరుపుకున్నారు. శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను గ్రామంలో పది రోజుల పాటు నిర్వహించగా స్వామి వారి కల్యాణం అనంతరం ఐదు రోజులకు అమ్మవారికి, స్వామివారికి దోపు నిర్వహిస్తారు. అనంతరం గ్రామ పురవీదుల్లో శ్రీలక్ష్మీనర్సింహస్వామిని ఘనంగా ఊరేగింపు నిర్వహించినంతరం డేగాట(కల్యాణంలో ఎదుర్కోల్లలాంటిది) నిర్వహిస్తారు. ఈ సమయంలో వేదపండి తుల ఆధ్వర్యంలో గ్రామస్తులు రెండు గ్రూపులుగా విడిపోయి ఒక గ్రూపు స్వామివైపు మరో గ్రూపు చెంచులక్ష్మీ అమ్మవార్ల తరుపున రంగులతో డేగాల ఆడతారు. ఆ తరువాత గ్రామస్తులు వసంతోత్సవంలో రంగులు చల్లుకోనే ఆనవాయితీ అనాదికాలంగా వస్తుంది. దేశవ్యాప్తంగా హోలీ పండుగ రోజు సంప్రదాయ పద్ధతిలో రంగుల పండుగను చేసుకుంటుడగా సల్కునూరు గ్రామస్తులు మాత్రం స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాలను అనుసరిస్తూ హోలి పండుగ చేసుకుంటారు. దీంతో బుధవారం ఆనవాయితీ ప్రకారం గ్రామంలోని అందరు ఉత్సాహంగా జరుపుకున్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ! నా క్లయింట్ అగు బొప్పని జీవన్ తండ్రి వెంకటరామయ్య, R/o నరూర్‌నగర్, హైదరాబాద్ గారు 1) గార్లపాటి అశోక్‌రెడ్డి 2) గార్లపాటి అమిత్‌రెడ్డి వీరి తరుపున జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ఏజెంట్గా వీరి తండ్రి గారు అయిన గార్లపాటి సతీష్‌రెడ్డి తండ్రి సీతారాంరెడ్డి, నివాసం మిర్యాలగూడ పట్టణం, నల్లగొండ జిల్లా గారి సంపూర్ణ యాజమాన్య హక్కు భుక్తములలో ఉన్న ఖాళీ స్థలం దిగువ షెడ్యూల్‌లో వివరముగా చూపబడిన దానిని అమ్ముటకు ప్రతిపాదించగా, నా క్లయింట్ కొనుగోలు చేయుటకు సమ్మతించినారు, అందులకు గాను కొంత సొమ్ము బయానాగా చెల్లించినారు. షెడ్యూల్ దాఖలు ఆస్తి పై ఎవరికైనా ఎలాంటి అభ్యంతరాలు గాని, ఆక్షేపణలు గాని, క్లైయిమ్‌లు గాని వగైరాలు ఉన్నచో ఈ దిగువ తెలిపిన అడ్రస్ వారికి తగిన సాక్ష్యాధారాలతో లిఖితపూర్వకంగా ఈ ప్రకటన వెలువడిన 7 (ఏడు) రోజులలో తెలుపగలరు. లేనిచో ఎవరికీ ఎలాంటి అభ్యంతరాలు, ఆక్షేపణలు, క్లైయిమ్‌లు వగైరాలు లేవని భావించి నా క్లయింట్ వారి పేరునగాని వారు సూచించిన వారి పేరు గాని మిగతా విక్రయ ధనం చెల్లించి షెడ్యూల్ ఆస్తి యొక్క విక్రయ దస్తావేజు రిజిస్ట్రేషన్ చేయించుకోగలరు. గడువు తదుపరి వచ్చు అభ్యంతరములు, ఆక్షేపణలు, క్లైయిమ్‌లు వగైరాలు గాని చెల్లనేరవని తెలియజేయబడినది.

షెడ్యూల్ :- నల్లగొండ జిల్లా, మిర్యాలగూడ మండలం, మిర్యాలగూడ పట్టణంలోని రామచంద్రగూడెం రెసిడెన్షియల్‌లో సర్వే నెం.79, బ్లాక్ నెం.32లో గల విస్తీర్ణం 160 గజాలు కలిగి.

తూర్పు: 24 ఫీట్ రోడ్, **పడమర:** బి.మహేష్ గారి స్థలం, **ఉత్తరం:** గ్రామకంఠం, **దక్షిణం:** అమ్మిన వారి స్వంత స్థలం.

సం/- **భూక్యా రమేష్ నాయక్,** అడ్వకేట్
ఇ.నెం.28-615, శ్రీ సాయినగర్ కాలనీ,
మిర్యాలగూడ పట్టణం, నల్లగొండ జిల్లా. సెల్ : 8341138578

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

దేవరకొండ : గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు చూడాలని దేవరకొండ డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం దేవరకొండ ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతేగాకుండా వంద శాతం ఇంటి పన్నుల వసూల్లే లక్ష్యంగా కార్యదర్శులు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ డానియల్, ఎంపీఓ నీలిమ, పాల్గొన్నారు.

చందంపేట : ఉమ్మడి చందంపేట మండలంలో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డివిజన్ పంచాయతీ అధికారి శంకర్ నాయక్ సూచించారు. బుధవారం చందంపేట ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించడంతో పాటు పశువులకు తొట్టిలలో నీటిని ఏర్పాటు చేయాలి. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు నర్ర రామలింగారెడ్డి, శైలేందర్, అంజయ్య, బాలరాజు, అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.


చందంపేట : మాట్లాడుతున్న శంకర్‌నాయక్

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

కొండమల్లేపల్లి : మండలంలోని జానిగానితండాలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ బాలరాజురెడ్డి తెలిపారు. కొంత కాలంగా తండాలో తాగునీటి సమస్య నెలకొనడంతో తండావాసులు ఎమ్మెల్యే బాలునాయక్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సూచించారు. దీంతో తండాలో బుధవారం నీటి సమస్యను పరిష్కరించాని ఎంపీడీఓ ఆదేశాల మేరకు అధికారులు తండాలో పర్యటించి నీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీశారు. ఆయన వెంట మిషన్ భగీరథ ఏఈ మాల్యాద్రి, పంచాయతీ కార్యదర్శి శోభ, మాజీ సర్పంచ్ మోత్యనాయక్ ఉన్నారు.

సీఎంఆర్ సకాలంలో పూర్తి చేయాలి

పెద్దఅడిశర్లపల్లి : కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ను సకాలంలో పూర్తి చేయని మిల్లులపై కఠిన చర్యలుంటాయని పౌర సరఫరాల ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ మిల్లర్లను హెచ్చరించారు. బుధవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని రైస్ మిల్లును, తనిఖీ చేసి మాట్లాడారు. మిల్లులు తమకు కేటాయించిన ధాన్యం నిల్వలకు సరిపడా స్థలం ఉండేలా చూడలన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి

మిర్యాలగూడ టౌన్ : అసంఘటిత రంగ కార్మికులకు ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ సంఘం జిల్లా కార్యదర్శి అశోక్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, హబీబ్, శ్రీధర్ రెడ్డి, అజయ్, నరేష్ పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో ఉద్యమాలు చేపట్టాలి


మిర్యాలగూడ : మల్లు స్వరాజ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మిర్యాలగూడ : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం చేసిన ఉద్యమాల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై భవిష్యత్‌లో ప్రజా ఉద్యమాలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మల్లు స్వరాజ్యం మూడో వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నూకల జగదీశ్చంద్ర, రవినాయక్, గౌతంరెడ్డి, బావండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడ్డి, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేములపల్లి : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం మూడో వర్ధంతి సందర్భంగా బుధవారం మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో ఆమె చిత్రపటానికి ఐద్వా ఆధ్వర్యంలో పూలామాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దపద్మ, లక్ష్మమ్మ, సైదమ్మ, శైలజ, జానకమ్మ, వెంకన్న, మట్టయ్య, పాల్గొన్నారు.

త్రిపురారం : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, మాజీ పార్లమెంట్ సభ్యుడు మల్లు స్వరాజ్యం వర్ధంతి వేడుకను సీపీఎం ఆధ్వర్యంలో నిడమనూరు వేంపాడులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండేటి శ్రీను, మలికంటి చంద్ర శేఖర్, శేఖర్, మహేష్, నాగరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఏజెంట్లు కావలెను

నల్లగొండ జిల్లాలో ఈ క్రింది ఏరియాలకు సాక్షి పేపర్ పంపిణీ చేయుటకు ఏజంట్లు కావలెను.

మిర్యాలగూడ

నియమ నిబంధనలు :

1) డిపాజిట్ రుసుము చెల్లించగల స్థోమత కలిగి ఉండాలి.
2) స్థానికులు అయి ఉండాలి. 3) ప్రతి నెల బిల్లు సక్రమంగా చెల్లించగలగాలి.
4) పేపర్ ఆలస్యము లేకుండా చందా దారులకు అందజేయగలగాలి.

సంప్రదించవలసిన నెంబర్ : 9705340866